# అవినీతి డబ్బుతో ఓట్లు కొనాలని చూస్తున్నారు

- అవినీతి ఆరోపణలతోనే 'బండి' అధ్యక్ష పదవి పోయింది
- ఎంపీగా నగరాభివృద్ధి కోసం ఆయన ఒక్క రూపాయైనా తీసుకువచ్చారా
- రౌడీషీటర్‌ను గెలిపిస్తే మన భూములు ఉంటాయా?
- నగరంలో ఎన్నికల ప్రచారంలో మంత్రి గంగుల కమలాకర్



ఎన్నికల ప్రచారంలో మంత్రికి మంగళ హారతులతో స్వాగతం పలుకుతున్న మహిళలు

కార్పొరేషన్, నవంబర్ 16: కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై అవినీతి ఆరోపణలు రావడం వల్లే ఆయనను పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించారని, అవినీతితో సంపాదించిన డబ్బుల మూటలతో ఈ ఎన్నికల్లో ఓటర్లను కొనేందుకు చూస్తున్నారని కరీంనగర్ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి గంగుల కమలాకర్ ఆరోపించారు. ఓటుకు రూ.20 వేలు ఇచ్చి గెలవాలని చూస్తున్నారని విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా గురువారం నగరంలోని 41, 43వ డివిజన్లలో నగర మేయర్ వై సునీల్‌రావుతో కలిసి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మంత్రికి మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికారు. అనంతరం పుష్పాభిషేకం చేసి తమ అభిమానాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి గంగుల కమలాకర్ మాట్లాడుతూ, బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి బండి సంజయ్‌ని ఎందుకు తొలగించారో ప్రజలకు చెప్పాలన్నారు. పదవిని అడ్డుపెట్టుకొని కోట్లాది రూపాయల అవినీతి చేశారన్న ఆరోపణలు రావడంతో తొలగించారని విమర్శించారు. ఇప్పుడు ఆ మూటలతో కార్యకర్తలకు లక్షలు పంచుతున్నారని, ఓట్లను కూడా కొంటామంటున్నారని ఆరోపించారు. ఎంపీగా గెలిచిన నాలుగున్నర ఏండ్లలో ఎప్పుడైనా ఈ కాలనీలకు సంజయ్ వచ్చారా? అని ప్రశ్నించారు. అభివృద్ధి కోసం ఒక్క రూపాయైనా తీసుకువచ్చారా అని నిలదీశారు. మరోవైపు కాంగ్రెస్ అభ్యర్థిపై భూకబ్జాలకు సంబంధించి 32 కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. రౌడీషీటర్ అయిన వారికి ఓట్లు వేస్తే మన భూములు మిగులుతాయా? అని ప్రశ్నించారు. తాము ఈ పదేళ్లలో రూ.వేల కోట్ల నిధులు తీసుకువచ్చి నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దామన్నారు. ఈ ఎన్నికల్లో మనం తప్పు చేస్తే భవిష్యత్తు తరాల నోట్లో మట్టికొట్టినట్లు అవుతుందన్నారు. కాంగ్రెస్, బీజేపీలకు ఓటు వేస్తే అధికారం ఆంధ్రా నాయకుల చేతుల్లోకి పోతుందన్నారు. మళ్లీ ఆరిగోస పడాల్సి వస్తుందన్నారు. వీటిని ఆలోచించి బీఆర్ఎస్‌ను గెలిపించాలన్నారు. ఓవైపు అవినీతి బీజేపీ అభ్యర్థి, మరోవైపు భూకబ్జాల కాంగ్రెస్ అభ్యర్థి ఉన్నారని.. మచ్చ లేని తనకు ఓటు వేసి మరోసారి ఆశీర్వాదం అందించాలన్నారు. అభివృద్ధి చేస్తున్న బీఆర్ఎస్‌ను గెలిపించాలని మంత్రి గంగుల కోరారు. ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు బండారి వేణు, సరిళ్ల ప్రసాద్, బీఆర్ఎస్ నాయకులు బిట్టు, ప్రశాంత్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి



బొమ్మకల్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి సతీశ్‌కుమార్

- ఓటేసి ఆశీర్వదించండి.. మరింత అభివృద్ధి చేస్తా
- హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్

సైదాపూర్, నవంబర్ 16: బీఆర్ఎస్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని పార్టీ హుస్నాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని అమ్మనగుర్తి, గుండ్లపల్లి, నల్లానిరామయ్యపల్లి, గొడిశాల, బొమ్మకల్, గుజ్జులపల్లి, ఎల్లంపల్లి గ్రామాల్లో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి, ప్రముఖ కళాకారుడు దరువు ఎల్లన్నతో కలిసి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో సతీశ్‌కుమార్‌కు మహిళలు మంగళహారులతో స్వాగతం పలికి, బొట్టుపెట్టి ఆశీర్వదించారు. ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ మాట్లాడుతూ, ఎన్నికల్లో ఓటు వేసి తనను ఆశీర్వదిస్తే నియోజకవర్గాన్ని మరింతగా అభివృద్ధి చేస్తానన్నారు. ప్రచారంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మాట్లాడుతూ, ఎన్నికల్లో సతీశ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపిస్తే, నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేస్తారన్నారు. కళాకారుడు దరువు ఎల్లన్న మాట్లాడుతూ, కాంగ్రెస్, బీజేపీ నాయకులు చెప్పే కల్లబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని, బీఆర్ఎస్‌తో తెలంగాణ అభివృద్ధి సాధ్యమన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరికలు**

నల్లానితండాకు చెందిన సింగిల్‌విండో డైరెక్టర్ గుగులోతు లక్ష్మితో పాటు పలువురు యువకులు బీఆర్ఎస్ పార్టీలో చేరగా, ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ గులాబీ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. అలాగే సోమారం అనుబంధ గ్రామం బూడిదపల్లి నుంచి సుమారు 100మంది ఒగ్గు కళాకారులు బుధవారం రాత్రి హుస్నాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో గులాబీ కండువా కప్పుకొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, వైస్ ఎంపీపీ రావుల శ్రీధర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకటరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కొండ గణేశ్, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి చెల్కల రాజేశ్వర్‌రెడ్డి, సర్పంచులు మిడిదొడ్డి సరితారమేశ్, గుండేటి సునీతారాజిరెడ్డి, గాజర్ల సదానందం, మ్యాకల శిరీషాముకుందరెడ్డి, తొంట కాంతమ్మ, బర్మావత్ అక్షయశ్రీనివాస్‌నాయక్, చింత లతాకుమారస్వామి, ఎంపీటీసీలు ఏరుకొండ ఇందిరాసుధీర్, గాజర్ల భాగ్యాలదెలు, నాయకులు ముత్యాల వీరారెడ్డి, చిట్టి ప్రకాశ్‌రెడ్డి, ఎల్లంపల్లి రవీందర్, ఏరుకొండ శ్రీనివాస్, గోనెల శ్రీనివాస్, ఈదులకంటి సంపత్, బర్మావత్ శంకర్ నాయక్ పాల్గొన్నారు.

# పేదల బతుకులు మార్చే పార్టీ బీఆర్ఎస్

- ఎన్నికల్లో కాంగ్రెస్ పన్నాగాలకు మోసపోవద్దు
- మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలి
- ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ అభ్యర్థి రసమయి బాలకిషన్



కరీంపేట్ ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్

శంకరపట్నం, నవంబర్ 16: పేదల బతుకులు మార్చే పార్టీ బీఆర్ఎస్ అని బీఆర్ఎస్ మానకొండూర్ అభ్యర్థి, ఎమ్మెల్యే డాక్టర్ రసమయి బాలకిషన్ పేర్కొన్నారు. గురువారం మండలంలోని కరీంపేట్, అంబాల్‌పూర్, ఇప్పలపల్లి, వంకాయగూడెం, చింతగుట్ట, తాడికల్ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసీఆర్ సీఎం అయ్యాక 24 గంటల కరెంటు సరఫరా చేస్తున్నామన్నారు. గోదావరి నీళ్లు తెచ్చి మూడు పంటలు పండేలా చేసిన ఘనత కేసీఆర్‌దే అన్నారు. ఇప్పటి వరకు రాష్ట్రంలో రైతులకు రూ.14 వేల కోట్ల రుణమాఫీ చేసినట్లు వెల్లడించారు. ప్రస్తుతం కాంగ్రెస్ నాయకుల పన్నాగంతోనే రుణమాఫీ ఆగిందని ఆరోపించారు. తాము తిరిగి అధికారంలోకి వచ్చాక ప్రతి రైతుకు రుణమాఫీ చేస్తామన్నారు. నియోజకవర్గంలోని 146 గ్రామాల్లో దళితబంధు పథకం ఇచ్చి తీరుతామన్నారు. ఈ నెల 20న జరిగే సీఎం కేసీఆర్ సభకు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ సందర్భంగా అంబాల్‌పూర్‌లో పలువురు ముదిరాజ్ కులస్తులు బీఆర్ఎస్‌లో చేరగా, ఎమ్మెల్యే వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వచ్చిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ నాయకుడు గడ్డం నాగరాజు, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మహిపాల్, వైస్ ఎంపీపీ రమేశ్, సర్పంచుల ఫోరం మండల చైర్మన్ పల్లె సంజీవరెడ్డి, సర్పంచులు ముంజ వసంత, బైరి సంపత్, గుర్రం లత, కీసర సుజాత, ఎంపీటీసీలు గాండ్ల తిరుపతి, బొజ్జ కవిత, బుద్దార్తి వరలక్ష్మి, ఏఎంసీ వైస్ చైర్మన్ వీరస్వామి, విండోల చైర్మన్ సంజీవరెడ్డి, మధుకర్‌రెడ్డి, పలు గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, ఉప సర్పంచ్ రవి, సీనియర్ నాయకులు సతీశ్‌రెడ్డి, వెంకటేశం, సంపత్, సమ్మయ్య, శ్రీకాంత్, శ్యాంరావు, ఆదిత్య, మల్లేశం, సంపత్, శ్రీనివాస్, సంపత్‌రెడ్డి, రమేశ్, బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

# ఆశీర్వదించండి అభివృద్ధి చేసి చూపిస్తా



మల్లారెడ్డిపల్లిలో మహిళలను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

- హుజూరాబాద్ నియోజకవర్గ అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, నవంబర్ 16: 'ఒక్క అవకాశం ఇవ్వండి. రూ.వెయ్యి కోట్లతో హుజూరాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తా' అని హుజూరాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని శ్రీరాములపేట, కోర్కల్, నర్సింహులపల్లి, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో గురువారం రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్, స్థానిక మండల ప్రజాప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి గ్రామంలో ప్రజలు పాడి కౌశిక్‌రెడ్డికి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయా చోట్ల ఆయన మాట్లాడుతూ, ఈటల రాజేందర్‌ను ఏడు సార్లు ఎమ్మెల్యేగా గెలిపిస్తే హుజూరాబాద్ నియోజకవర్గాన్ని ఏమాత్రం అభివృద్ధి చేయలేదని, ఒక్కసారి తనకు అవకాశం ఇస్తే అభివృద్ధి అంటే ఏంటో చేసి చూపిస్తానని పేర్కొన్నారు. రాష్ట్ర టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ, కారు గుర్తుకు ఓటు వేసి పాడి కౌశిక్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కోర్కల్, మల్లారెడ్డిపల్లి గ్రామాల్లో బీజేపీ, కాంగ్రెస్‌ల నుంచి సుమారు 20 మంది పాడి కౌశిక్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు రఘుపాల్‌రెడ్డి, జమ్మికుంట మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బాలకిషన్‌రావు, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు మర్రి వరలక్ష్మి-స్వామి, ఎంపీటీసీలు సంగ స్వరూప-సమ్మయ్య, ఉపసర్పంచులు ముద్దసాని భిక్షపతి, అమరగొండ తార-విజేందర్, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు కొలిపాక రాకేశ్, నల్ల కోమల్‌రెడ్డి, నాయకులు సంది సమ్మిరెడ్డి, తిరుపతిగౌడ్, బొబ్బల సమ్మిరెడ్డి, అంబాల అనిల్, ముద్దసాని సమ్మయ్య, వెంకటేశ్, వంతడుపుల సమ్మయ్య, అలుగువెల్లి హరీశ్‌రెడ్డి, మహేందర్, గందం పోచయ్య, అమరగొండ అనిల్, చుక్కల శ్రీనివాస్, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# 75 ఏండ్ల భారత ఆర్థిక వ్యవస్థ గ్రంథం ఆవిష్కరణ




గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న వీసీ ప్రొఫెసర్ మల్లేశ్

కమాన్‌చౌరస్తా, నవంబర్ 16: శాతవాహన విశ్వవిద్యాలయం అర్థశాస్త్ర విభాగం ఆచార్యులు డాక్టర్ కే శ్రీవాణి సంపాదకీయంలో వెలువడిన '75 సంవత్సరాల భారత ఆర్థిక వ్యవస్థ' పరిశోధనాత్మక గ్రంథాన్ని గురువారం విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ సంకశాల మల్లేశ్ తన చాంబర్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఉపకులపతి మాట్లాడుతూ, 75 ఏండ్లలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చి ఆర్థికపరమైన పురోగతి దిశలో దేశం సాగుతున్నదన్నారు. గ్రంథం సంపాదకురాలు డాక్టర్ కే శ్రీవాణి మాట్లాడుతూ, గతంలో ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ అండ్ రీసెర్చ్(ఐసీఎస్ఎస్ఆర్), తెలంగాణ ఉన్నత విద్యామండలి (టీఎస్‌సీహెచ్ఈ) ఆర్థిక సహకారంతో నిర్వహించిన జాతీయ సెమినార్‌లో పాల్గొన్న అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు సమర్పించిన పరిశోధనా వ్యాసాలను క్రోడీకరించి గ్రంథాన్ని ముద్రించామన్నారు. ముందుతరం పరిశోధకులకు ఈ గ్రంథం ఎంతో ఉపయుక్తమని సూచించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వరప్రసాద్, యూనివర్సిటీ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మహ్మద్ జాఫర్ జరి, కే పద్మావతి, సోషియాలజీ విభాగాధిపతి, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.